సాక్షి
సంగారెడ్డి
బుధవారం । 28 । జూన్ । 2023



సర్పంచ్ టు రాజ్యసభ

ఉమ్మడి మెదక్ జిల్లాలో సర్పంచ్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎదిగిన సోలిపేట రామచంద్రారెడ్డిపై సాక్షి కథనం. 8లో



కోర్టు ఆదేశాలు బేఖాతరు

గ్రామకంఠం అనే బోర్డును అధికారులు ఏర్పాటు చేసినా ఓ పరిశ్రమ యాజమాన్యం లెక్కచేయకుండా ఆ స్థలం నుంచే రోడ్డును వేయించటం వివాదాస్పదంగా మారింది. 9లో

ఆరుగురికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు



పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఆరుగురికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 10 మందికి నిర్వహించినట్లు తెలిపారు.

నేడు జిల్లా వ్యవసాయాధికారితో ఫోన్ ఇన్

వర్షాలు ఆలస్యంగా రావడం, వానాకాలం పంటల సాగుకు అవసరమైన సలహాలు, సూచనలు రైతులకు అందించేందుకు జిల్లా వ్యవసాయాధికారి నరసింహారావుతో సాక్షి 'ఫోన్ ఇన్' నిర్వహించనుంది. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో ఎప్పటివరకు ఏయే పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయనే తదితర సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.





తేదీ: 28-06-2023

సమయం: బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ :

72888 94403, 99083 22511

న్యూస్‌రీల్

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



బోరు వేయిస్తున్న రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): మున్సిపల్ పరిధిలో నీటి సమస్య లేకుండా ఉండేలా చర్యలు చేపడుతున్నామని బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి తెలిపారు. మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో ఉన్న శ్రీరాంగనర్‌లో మంగళవారం బోరు వేయించారు. ఈ సందర్భంగా రోజారాణి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీల్లోనూ నీటి సమస్య లేకుండా ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజల కోరిక మేరకు బోర్లు వేయించి సమస్యను సత్వరమే పరిష్కరిస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సీఐగా లాలునాయక్ బాధ్యతలు



సీఐగా బాధ్యతలు స్వీకరించిన లాలునాయక్

పటాన్‌చెరు టౌన్: క్రైమ్ సీఐగా విధులు నిర్వహిస్తున్న లాలు నాయక్ పటాన్‌చెరు సీఐగా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డికి డీఎస్పీగా పదోన్నతి రావడంతో బదిలీపై ఆయన సంగారెడ్డి ఎస్‌బీ(స్పెషల్ బ్రాంచ్)కి అటాచ్ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో లాలునాయక్‌ను నియమితులయ్యారు. ఈ సందర్భంగా నాయక్ మాట్లాడుతూ శాంతిభద్రతలు కాపాడడంలో ముందుంటానని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అల్లర్లు గొడవలూ చేస్తే సదరు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

'క్విజ్' విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులను అందజేస్తున్న కెనరా బ్యాంక్ అధికారులు, ఏఈఓ బస్వరాజ్

జహీరాబాద్ టౌన్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ద్వారా 'ఆలిండియా ఫైనాన్షియల్ లెట్రసీ 2023'పై పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం క్విజ్ పోటీలను నిర్వహించారు. మండలస్థాయి క్విజ్ పోటీల్లో మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. జహీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.అబ్రహం, కె. సమీయోద్దీలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందారు. సత్వార్ పాఠశాలకు తృతీయ బహుమతి వచ్చింది. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద వరుసగా రూ. 5 వేలు, 4 వేలు, 3 వేల నగదుతోపాటు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ రాఘవేంద్రరావు, మేనేజర్ ప్రదీప్ కుమార్, ఏఈఓ బస్వరాజ్, కోఆర్డినేటర్ సలీమోద్దీన్ పాల్గొన్నారు.

రైతన్నకు మొండిచేయి

- వ్యవసాయ అనుబంధ రంగాలపై బ్యాంకర్ల చిన్నచూపు
- ఎంఎస్‌ఎంఈలకు లక్ష్యానికి మించి రుణాలు
- 2022–23 ఆర్థిక సంవత్సరంలో రుణ మంజూరులో బ్యాంకర్ల తీరిదీ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: వ్యాపారులు, సేవా రంగంలో ఉన్న (ఎంఎస్‌ఎంఈ) వారికి గత ఆర్థిక సంవత్సరం (2022–23)లో జిల్లాలోని బ్యాంకులు రూ.950 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. అయితే ఏకంగా రూ.1,371 కోట్లు రుణాలిచ్చాయి. వ్యాపారులకు ఇచ్చే లోన్ల విషయంలో నిర్దేశిత లక్ష్యం కంటే 44 శాతం అధికంగా రుణాలు కట్టబెట్టాయి. దీన్ని బట్టి చూస్తే వ్యాపారులకు ఇచ్చే రుణాల విషయంలో బ్యాంకులు చూపిన ఉదారత ఏ విధంగా ఉందో స్పష్టమవుతోంది.

రుణాల మంజూరులో బ్యాంకర్ల తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. అత్యంత ప్రాధాన్యత రంగమైన వ్యవసాయానికి ఇవ్వాల్సిన రుణాల మంజూరులో తీవ్ర అలసత్వం చేస్తున్నారు. సోమవారం జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిగింది. రానున్న ఆర్థిక సంవత్సరం 2023–24లో జిల్లాలో ఉన్న బ్యాంకులు ఇవ్వనున్న వార్షిక రుణ ప్రణాళికను ప్రకటించారు. అలాగే గత ఆర్థిక సంవత్సరం 2022–23లో వివిధ రంగాలకు బ్యాంకులు ఇచ్చిన రుణాల వివరాలనూ వెల్లడించారు. ఇందులో అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లోన్లు నామమాత్రంగా ఇచ్చినట్లు నివేదికలు చెబుతున్నాయి. అలాగే అగ్రికల్చర్ టర్మ్‌లోన్లు మంజూరులో కూడా తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శించాయని నివేదికలను పరిశీలిస్తే స్పష్టమవుతోంది. రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో పైప్‌లైన్లు నిర్మాణానికి, సోలార్ ప్లాంట్ల ఏర్పాటు వంటి వాటికి తీసుకునే రుణాలను అగ్రికల్చర్ టర్మ్‌లోన్లు అంటారు. వ్యాపారులు, సేవా సంస్థలు ఏటా రూ.25 లక్షలకు మించి టర్నోవర్ ఉన్న వారికి బ్యాంకులు ఎంఎస్ఎంఈ లోన్లు ఇస్తుంటాయి. ఇక విద్యా సంబంధిత రుణాలు కూడా నామమాత్రంగానే ఇచ్చినట్లు నివేదికలు చెబుతున్నాయి. రూ.80 కోట్ల లక్ష్యానికి గాను కేవలం 21.65 కోట్లు మాత్రమే ఇచ్చాయి. సాధారణంగా మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు విదేశాల్లో చదువుకోవాలని ఉత్సాహం, అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో ఉన్నత చదువులు అభ్యసించలేక పోతున్నారు. ఇలాంటి వారికి ఇవ్వాల్సిన రుణాల విషయంలోనూ బ్యాంకర్లు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు.



రైతులకు సంబంధించి(2021–22కు గాను) అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగానికి రూ.115 కోట్లు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. బ్యాంకులు కేవలం రూ.12.64 కోట్లు మాత్రమే ఇచ్చాయి. నిర్దేశిత లక్ష్యంలో కేవలం 10.9 శాతం మాత్రమే. అగ్రికల్చర్ టర్మ్‌లోన్లు రూ.718 కోట్లు మంజూరు చేయాలని నిర్ణయించగా, రూ.442 కోట్లే ఇవ్వగలిగాయి. వ్యవసాయ అనుబంధ రంగాలకు ఇచ్చే రుణాల విషయంలోనూ బ్యాంకులు ఏ మేరకు అలసత్వం వహిస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు.

పంట రుణాలు..

రైతులకు ఇచ్చే పంట రుణాలను నిర్దేశిత లక్ష్యం మేరకు మంజూరు చేసినట్లు రికార్డుల్లో అధికారులు పేర్కొంటున్నారు. గత ఖరీఫ్, రబీ సీజన్లతో కలిపి రూ.2,450 కోట్లు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, రూ.2,902 కోట్లు మంజూరు చేసినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే చాలా వరకు బ్యాంకులు రైతుల పంట రుణాలను పుస్తక సర్దుబాటు (బుక్ అడ్జెస్ట్‌మెంట్) చేశాయి. గత ఏడాది తీసుకున్న పంట రుణాలను రెన్యూవల్ చేశాయి. మరోవైపు సాగు అవసరాల కీలక సమయంలో రుణాలివ్వలేదనే అభిప్రాయం కూడా రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.

పర్సనల్ లోన్లు ఫుల్

వ్యవసాయ అనుబంధ రంగాలకు అంతంత మాత్రంగా రుణాలిస్తున్న బ్యాంకులు పర్సనల్ (వ్యక్తిగత) లోన్లు మాత్రం విరివిగా అందిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో రూ.310 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంటే ఏకంగా 1,799 కోట్లు వ్యక్తిగత రుణాలివ్వడం గమనార్హం. ఈ పర్సనల్ లోన్లు ఇచ్చేందుకు బ్యాంకులు ప్రత్యేకంగా ప్రతినిధులను నియమించుకుని మంజూరు చేస్తుండటం సాధారణంగా మారిపోయింది.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కృపకుమార్

వైస్‌చైర్మన్ సహా 16 మంది డైరెక్టర్ల నియామకం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సదాశివపేట వ్యవసాయ మార్కెట్ కమిటీకి చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌తో సహా 16 మంది డైరెక్టర్లతో కూడిన నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ అగ్రికల్చర్ కోఆపరేషన్ డిపో కార్యదర్శి ఎం.రఘునందన్ రావు మంగళవారం ఉత్తర్వులిచ్చారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్సీ(మహిళ)కు రిజర్వు కావడంతో కొండాపూర్ మండలం మల్కాపూర్‌కు చెందిన సడకుల కృప కుమార్‌ను చైర్మన్‌గా, వైస్‌చైర్మన్‌గా రేజింతల శ్రీధర్‌రెడ్డిని నియమించారు. డైరెక్టర్లుగా మఠం కరుణాకర్(నిజాంపూర్), మచ్‌కురి రాములు (ఎన్కేపల్లి), గొల్ల నవీన్‌కుమార్ (వెల్టూర్), సయ్యద్ ఆరీఫ్ (మద్దికుంట), చౌటి కుమార్ గౌడ్ (పెద్దాపూర్), నల్ల శంకర్ (సదాశివపేట), షాజియాబేగం(సదాశివపేట), బానోత్ చక్రనాయక్ (హరిదాసుపూర్‌తండా), పడమటి అమరేందర్‌రెడ్డి (గుంతపల్లి), బొడగమ నాగభూషణం (సదాశివపేట), వర్తక సంఘం నుంచి సత్యనారాయణ (సదాశివపేట), ఉల్లిగడ్డ విద్యాసాగర్ (సదాశివపేట)లను డైరెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. గొల్లపల్లి సహకార సంఘం చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మ, అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్‌తోపాటు జిల్లా మార్కెటింగ్ అధికారి.. సభ్యులుగా ఉండనున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏఎన్‌ఎం పోస్టులకు ఔట్‌సోర్సింగ్ ప్రతిపాదన పని చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ శరత్ తెలిపారు. జిల్లాలోని నారాయణఖేడ్, బొమ్మరెడ్డిగూడెం, హత్నూర, సంగారెడ్డి, జహీరాబాద్, జోగిపేట్, సిరిపుర పాఠశాలల్లో 12 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. జూలై 13వ తేదీ లోపు ఆసక్తి గల అభ్యర్థులు వెబ్‌సైట్ httpr//tsobmms.cgg.gov.in దరఖాస్తులు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు 91003 25336 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

నూనె, పప్పు గింజల సాగుకు ప్రోత్సాహం



మినీకిట్స్‌ను అందజేస్తున్న ఏడీఏ భిక్షపతి

జహీరాబాద్ టౌన్: నాణ్యమైన విత్తనాల ఉత్పత్తితోపాటు నూనె, పప్పు గింజల సాగును ప్రోత్సహించడానికి రైతులకు పలు రకాల విత్తనాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని వ్యవసాయ శాఖ ఏడీఏ భిక్షపతి తెలిపారు. మండలంలోని హోతి(కె)లో సోయాబిన్, కంది, మినుము, రాగి విత్తనాల (మినీకిట్స్)ను మంగళవారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పప్పు దినుసులు, నూనె గింజలు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడానికి డివిజన్ పరిధిలోని రైతులకు వందశాతం సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు అందజేస్తున్నామన్నారు.

30 లోగా జీపీ పనులు ప్రారంభించండి

కలెక్టర్ డాక్టర్ శరత్

పంచాయతీ భవనాల నిర్మాణాలు నత్తనడక నడుస్తున్నాయని, కొన్ని ఇంకా ప్రారంభం చలేదని సాక్షిలో మంగళవారం ప్రచురితమైన ప్రత్యేక కథనానికి కలెక్టర్ శరత్ స్పందించారు. రివ్యూ చేసి ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

సాక్షి ఎఫెక్ట్



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: జిల్లాలో మంజూరైన అన్ని గ్రామ పంచాయతీ భవనాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో వివిధ శాఖల అధికారులతో జిల్లాలోని వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మంజూరైన గ్రామ పంచాయతీ భవనాలన్నింటినీ గ్రౌండింగ్ చేసి, పనులు ఈనెల 30 లోపు ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

- స్వచ్ఛ సర్వేక్షణ్ కింద మూడు కేటగిరీలలో 15 గ్రామపంచాయతీలు ఉన్నాయని, ఆయా కేటగిరీలలో ఎలాంటి గ్యాప్స్ లేకుండా సంబంధిత అధికారులు, ప్రత్యేక అధికారులు చూసుకోవాలన్నారు.
- హరిత లక్ష్యాన్ని పూర్తి చేయాలని, గ్రామపంచాయతీలు మున్సిపాలిటీలలో ఆయా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యం మేరకు ప్రణాళికతో మొక్కలు నాటాలని సూచించారు.
- హరితహారంలో భాగంగా వైకుంఠధామాలు, డంపింగ్ యార్డ్స్, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలకు బయో ఫెన్సింగ్, రోడ్ సైడ్ ఎవెన్యూ ప్లాంటేషన్, విద్యాసంస్థల్లో నాటిన మొక్కలలో గల గ్యాప్స్ పూర్తి చేయాలని తెలిపారు.
- ఎంపీడీవోలు ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు.
- బీసీలకు లక్ష రూపాయల ఆర్థిక సాయం పథకం కింద జిల్లాలో వచ్చిన ప్రతి దరఖాస్తునూ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ విషయంలో మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడూ సమీక్షించాలని సూచించారు.
- మహిళా సమాఖ్యల ద్వారా చేపట్టిన వైద్య శాఖ సబ్ సెంటర్ బిల్డింగ్స్ నిర్మాణాలపైనా దృష్టి సారించి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని డీపీఎంలకు కలెక్టర్ సూచించారు.
- మన ఊరు మనబడి కింద చేపట్టిన పనులకు సంబంధించి సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలతో మండలంవారీగా సమీక్షించారు.
- ఆయా పాఠశాలల్లో మంజూరైన పనులన్నింటినీ గ్రౌండింగ్ చేసి 15 రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.
- పనుల పురోగతిపై రెగ్యులర్‌గా సమీక్షించాలని డీఇఓకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీఆర్డీఓ శ్రీనివాసరావు, డీపీఓ సురేష్ మోహన్, బీసీ సంక్షేమ అధికారి జగదీశ్, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఎంపీడీవోలు, డీ ఎల్పీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీఓలు, ఏపీవోలు, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఇంజినీరింగ్ శాఖల అధికారులు, ఎంఈఓలు, ఎంఈలు పాల్గొన్నారు.

సర్వే నూరు శాతం చేయాలి

ఎలక్ట్రోలు ఇంటింటి సర్వే నూరు శాతం చేయాలని కలెక్టర్ శరత్ అన్నారు. మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో డీఆర్ఓ, ఆర్డీఓ, తహసీల్దార్‌లతో ఈసీఐ నియమావళిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బీఎల్ఓ, వీఎల్ఓ, బీఆర్ఓ, సూపర్‌వైజర్లు ఇంటింటి సర్వే చేసి బోగస్ ఓట్లు గుర్తించాలన్నారు. 18 నుంచి 29 ఏళ్ల వారిని గుర్తించడానికి యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలన్నారు. మండలాలలో ఇంటర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లతో కోఆర్డినేషన్ చేసుకుని ఓటరు ఎన్‌రోల్‌మెంట్ నూరు శాతం చేయాలన్నారు. ఓటర్ లిస్టును క్రాస్ చెక్ చేసుకోవాలని సూచించారు. బోగస్ ఓట్ల నమోదు కాకుండా చూడాలన్నారు. బీఎల్ఓలు 80 ఏళ్ల వయసు గల ఓటర్ల వివరాలు సేకరించాలన్నారు. 1,400 ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ ఉండాలన్నారు. ఒకే కుటుంబంలో ఉన్న ఓటర్లకు ఒకే పోలింగ్ స్టేషన్లో ఓటు ఉండాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, డీఆర్ఓ నగేశ్, అధికారులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

భూగర్భ జలాల శాఖ జాయింట్ డైరెక్టర్ కె.లక్ష్మ



సర్వే చేస్తున్న లక్ష్మ తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): రైతుల కోసం ప్రవేశపెట్టే పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని భూగర్భ జలాల శాఖ జాయింట్ డైరెక్టర్ కె.లక్ష్మ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బిడేకన్నెలో పర్యటించి బోరు బావులు తవ్వించేందుకు చేసిన సర్వే వివరాలు క్షేత్రస్థాయి లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు సాగును ప్రోత్సహించేందుకు పీఎం అజయ్ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. అసైన్మెంట్ భూములలో బోరు బావులు ఏర్పాటు చేసి, విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. గ్రామంలో మొత్తం 154 మంది లబ్ధిదారులు ఉన్నారని పేర్కొన్నారు. గ్రూపులుగా విభజించి యూనిట్లవారీగా అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు సంతోష్ కుమార్, ఎండీ వజావుద్దీన్, పంచాయతీ కార్యదర్శి శివశంకర్, నాయకులు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

బీకాం ఆరో సెమిస్టర్ పరీక్షలో గందరగోళం

- గంట ముందే జవాబు పత్రాలు తీసుకున్న ఇన్విజిలేటర్స్
- విద్యార్థుల నిలదీతతో పరీక్ష నిర్వహణ, ఆపై సద్దుమణిగిన వివాదం



ప్రశ్న పత్రం చూపుతున్న విద్యార్థులు

సదాశివపేట(సంగారెడ్డి): బీకాం ఆరో సెమిస్టర్ థియరీ ప్రాక్టీస్ ఆఫ్ జీఎస్టీ పరీక్ష సమయం విషయమై గందోళగోళం నెలకొంది. ఈ ఉదంతం మంగళవారం సంగారెడ్డి జిల్లా సదాశిపేట పట్టణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చోటుచేసుకుంది. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు డిగ్రీ ఫైనలియర్ థియరీ ప్రాక్టీస్ ఆఫ్ జీఎస్టీ ఆరో సెమిస్టర్ పరీక్షలకు విద్యార్థులు హాజరయ్యారు. 50 మార్కులకు ప్రశ్న పత్రానికి 2 గంటలు మాత్రమే సమయం ఉందని ఇన్విజిలేటర్లు చెప్పారు. డిగ్రీ కాలేజీలోని పరీక్ష హాలు 4వ గదిలో పరీక్ష రాస్తున్న 32 మంది పద్మనాభ డిగ్రీ కళాశాల విద్యార్థుల నుంచి ఇన్విజిలేటర్ 11.30 (రెండు) గంటలకే వారి నుంచి జవాబు పత్రాలు తీసుకుని బయటకు పంపించారు. దీంతో విద్యార్థులు, పద్మనాభ కళాశాల ప్రిన్సిపాల్ అనిల్‌కు జరిగిన విషయం తెలిపారు. దీంతో ప్రిన్సిపాల్ అనిల్ ప్రభుత్వ కళాశాలకు చేరుకొని, గంట ముందు బయటకు ఎందుకు పంపించారని విద్యార్థులతో కలిసి నిలదీశారు. దీనిపై పరీక్షల ఇన్‌చార్జి వినయకుమార్ ఉస్మానియా యూనివర్సిటీ అధికారులతో మాట్లాడి వారి అనుమతిలో 32 మందికి బీకాం సిక్స్ థియరీ ప్రాక్టీస్ ఆఫ్ జీఎస్టీ పరీక్షను నిర్వహించడంతో గొడవ సద్దుమణిగింది.

యూపీహెచ్‌సీలో ఎన్‌క్వాస్ బృందం తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న బృందం సభ్యులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: పట్టణంలోని మార్క్స్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (యూపీహెచ్‌సీ) మంగళవారం ఎన్‌క్వాస్(నేషనల్ క్వాలిటీ స్టాండర్డ్స్) అసెస్మెంట్‌లో భాగంగా ఇద్దరు సభ్యులతో కూడిన కేంద్ర బృందం సందర్శించింది. బృందం సభ్యులు డాక్టర్ మినిమోల్, డాక్టర్ రుక్మిణి యూపీహెచ్‌సీలోని ఆయా విభాగాలు క్షుణంగా పరిశీలించారు. వైద్యసేవలు, రికార్డులు తదితరాలపై ఆరా తీశారు. పరిసరాల పరిశుభ్రత, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ నూ పరిశీలించారు. అంతకుముందు యూపీహెచ్‌సీ ప్రగతి, సేవలను తెలుసుకున్నారు.

మౌలిక వసతులకు కృషి

జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు



చిన్నారుల రీడింగ్ స్కిల్స్ పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

పటాన్‌చెరు టౌన్: జిల్లాలో మన ఊరు మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నామని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని ముత్తంగి ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల రీడింగ్, రైటింగ్ స్కిల్స్ పెరిగాయన్నారు. ముత్తంగి ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛంద సంస్థ ద్వారా పీఈటీని ఏర్పాటు చేశామన్నారు. అలాగే విద్యార్థులకు ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటున్నారని వివరించారు. మన ఊరు – మన బడిలో భాగంగా ముత్తంగి హైస్కూల్‌లో మైనర్ వర్కులు చేయాల్సి ఉందన్నారు. వారంలో పనులు పూర్తి కాగానే హైస్కూల్‌ను ప్రారంభించుకుంటామన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

జెడ్పీ సమావేశానికి అధికారుల డుమ్మా



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ

ఆగ్రహం వ్యక్తం చేసిన చైర్‌పర్సన్ మంజుశ్రీ

సంగారెడ్డి మున్సిపాలిటీ: జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశానికి జిల్లా అధికారులు గైర్హాజరు కావడంపై చైర్‌పర్సన్ మంజుశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు జిల్లా అధికారులు హాజరు కాకపోవడంపై ఆమె మాట్లాడుతూ, ప్రతి మూడునెలలకోసారి నిర్వహించే సమావేశాలకు సైతం అధికారులు హాజరు కాకుంటే తమకు ప్రోగ్రెస్ ఎలా తెలుస్తుందని మండిపడ్డారు. కలెక్టర్ సమావేశం తర్వాత అతి ముఖ్యమైన సమావేశం జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశమని గుర్తుచేశారు. అధికారులు స్టాండింగ్ కమిటీ సమావేశంలో వివిధ పథకాల పనుల పురోగతిని తెలియజేస్తే ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇకపై నుంచి స్టాండింగ్ కమిటీ సమావేశానికి విధిగా జిల్లా అధికారులు హాజరుకావాలని ఆదేశించారు. ఉదయం.. జిల్లా గ్రామీణ అభివృద్ధి, జిల్లా పంచాయతీ విభాగం, ఉపాధి కల్పన, యువజన సంక్షేమ, గృహ నిర్మాణం, జిల్లా సహకార సంఘం, చేనేత శాఖ, టీఎస్ రెడ్కో, గనులు.. భూగర్భ ఖనిజాలు, ఖాదీ బోర్డు, రోడ్డు రవాణా సంస్థ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, బ్యాంక్ శాఖల వారీగా సమావేశం నిర్వహించారు. మధ్యాహ్నం.. విద్య, గ్రంథాలయ, వైద్యారోగ్య శాఖలపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, అధికారులు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్‌లో 17మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: ఇటీవల పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు మంగళవారం సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గత ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 17మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 17 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

నారాయణఖేడ్: ఇసుక లోడుతో వెళ్తున్న లారీ టైరు అకస్మాత్తుగా పేలడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం నిజాంపేట్ వైపు నుంచి నారాయణఖేడ్ వైపునకు ఇసుక లోడుతో వస్తున్న లారీ వెంకటాపూర్ చౌరస్తా వద్దకు రాగానే లారీ ముందు టైరు పేలింది. దీంతో లారీ అదుపుతప్పి పక్కకు ఆగడంతో పెను ప్రమాదం తప్పింది. టైరు పేలిన కారణంగా రహదారిపై లారీ నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. దీంతో వాహనదారులు రెండు గంటల పాటు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పోక్సో కేసులో జైలు

సిద్దిపేటకమాన్: నేరం రుజువు కావడంతో పోక్సో కేసులో ఓ వృద్ధుడు జైలు పాలయ్యాడు. ఏసీపీ దేవారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పరిధిలోని గాడిచర్లపల్లి గ్రామానికి చెందిన అక్కరాజుల మల్లయ్య (70) సిద్దిపేట మండలానికి చెందిన ఏడు సంవత్సరాల పాపను 2018 సెప్టెంబర్ 17వ తేదీన శారీరకంగా హింసించడంతో పాటు అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో పాప తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి వన్‌టౌన్ సీఐ నందీశ్వర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అప్పటి ఏసీపీ రామేశ్వర్ కేసు తదుపరి పరిశోధన పూర్తి చేసిన అనంతరం రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అనంతరం ఇద్దరివాదనలు విన్న తర్వాత నేరం రుజువు కావడంతో మంగళవారం సిద్దిపేట అడిషనల్ డిస్ట్రిక్ సెషన్స్ న్యాయమూర్తి నేరస్తుడికి రూ. 5వేల జరిమానాతో పాటు 7 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

క్రెడిట్ కార్డు నుంచి రూ.3.50 లక్షలు స్వాహా

పటాన్‌చెరు టౌన్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని క్రెడిట్ కార్డు నుంచి రూ.3.50 లక్షలను సైబర్ నేరగాళ్లు కాజేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అమీన్‌పూర్ పరిధిలోని లక్ష్మీహోమ్స్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి చెందిన క్రెడిట్ కార్డు నుంచి ఏప్రిల్ 22వ తేదీన సైబర్ నేరగాళ్లు పలు ధపాలుగా రూ.3.50 లక్షలు కాజేశారు. గమనించిన ఉద్యోగిని ముందుగా సైబర్ క్రైంలో ఫిర్యాదు చేసింది. అనంతరం మంగళవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

దేవాలయంలో చోరీ



కొండపాక(గజ్వేల్): దండు మైసమ్మ తల్లి దేవాలయంలో చోరీ జరిగింది. ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. లకుడారం గ్రామ శివారులోని దండు మైసమ్మ తల్లి దేవాలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ పగులగొట్టి నగదు అపహరించారు. గమనించిన పూజారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సర్పంచ్ టు రాజ్యసభ

70 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో రామచంద్రారెడ్డిని వరించిన ఎన్నో పదవులు



సోలిపేట రామచంద్రారెడ్డి (ఫైల్)

దుబ్బాకటౌన్: తొలితరం కమ్యూనిస్టునేతగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన సోలిపేట రామచంద్రారెడ్డిని 70 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు వరించాయి. మట్టిమనుషులతో కలిసి తిరిగిన జమీన్ లీడర్‌గా ఆయనకు గుర్తింపు ఉంది. ప్రజల మేలు కోసం పరితపించే సిసలైన నాయకుడు. స్థానిక సంస్థల దగ్గరి నుంచి విదేశీ విధానాల వరకు ప్రత్యక్ష అవగాహన కలిగిన నేతగా పేరుంది. ఇప్పుడు గొప్పగా చెప్పకుంటున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలు, నూతనచట్టాలపై కొన్ని దశాబ్దాల కిత్రమే రామచంద్రారెడ్డి ఎలుగెత్తి చాటిన విషయం చాలా తక్కువమందికి మాత్రమే తెలుసు. **రామచంద్రారెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లో మంగళవారం ఉదయం మృతి చెందారు.** దీంతో ఆయన స్వగ్రామమైన చిట్టాపూర్‌తోపాటు, ఉమ్మడి మెదక్ జిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

- ఎమ్మెల్యేగా పనిచేసే కాలంలోనే రామచంద్రారెడ్డి దొమ్మాట నియోజకవర్గపరిధిలో వ్యవసాయం, రోడ్ల అభివృద్ధికి విశేష కృషి చేశారు. రాజ్యసభ సభ్యుడిగా కూడవెల్లివాగుపై చెక్ డ్యాంలు నిర్మించేందుకు పెద్దఎత్తున నిధులు మంజూరు చేయించారు.
- రామచంద్రారెడ్డి వాలీబాల్ ప్లేయర్. బాల్యంలో తోటి స్నేహితులతో కలిసి వాలీబాల్ బాగా ఆడేవారని చిట్టాపూర్‌వాసులు గుర్తుచేసుకుంటున్నారు.
- పుస్తక పఠనం ఆయనకు ఎంతో ఇష్టం. వారంలో నాలుగు రోజులు లైబ్రరీలో గడిపేవారు. ఎనిమిదిపదుల వయస్సులోనూ రోజు నాలుగైదు దినపత్రికలు చదివేవారు. సాహిత్య కార్య క్రమాలకు ఎవరు ఆహ్వానించినా తప్పకుండా వెళ్లేవారు.



మాజీ సీఎం చెన్నారెడ్డితో దుబ్బాక పర్యటనలో

సొంతూరి నుంచే...

దుబ్బాక మండలం చిట్టాపూర్‌లో మాలిపటేల్ సోలిపేట గాలిరెడ్డి– సుందరమ్మ దంపతులకు 1935లో రామచంద్రారెడ్డి జన్మించారు. సొంతూరిలోనే ప్రాథమిక విద్య పూర్తి చేశారు. ఆపై సిద్దిపేటలో పదోతరగతి వరకు చదివారు. ఇంటర్, డిగ్రీ హైదరాబాద్ సిటీకాలేజీలో చదివారు. ఈ సమయంలోనే 1951లో సిటీ కాలేజీకి స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడిగా గెలుపొందారు. అప్పుడే జరిగిన పరిణామాలతో అతడిలో కమ్యూనిజం బీజాలు మొలకెత్తాయి. దీంతో చదువుకు స్వస్తి చెప్పి స్వగ్రామానికి వచ్చాడు.

- చిట్టాపూర్ మొట్టమొదటిసర్పంచ్‌గా 1955లో ఎన్నికై 1964 వరకు అదే పదవిలో కొనసాగారు.

కేసీఆర్‌కు రాజకీయగురువు

ప్రస్తుత సీఎం కేసీఆర్‌కు రామచంద్రారెడ్డి రాజకీయ గురువు. సీఎం స్వగ్రామమైన చింతమడక దుబ్బాక సమితి పరిధిలోనే ఉండేది. సమితి ప్రెసిడెంట్ నుంచి ఎమ్మెల్యేగా రామచంద్రారెడ్డి గెలుపొందినప్పటి నుంచి కేసీఆర్ తరచు కలిసేవారు. 1988లో టీడీపీ నాయకులకు రామచంద్రారెడ్డి నేతృత్వంలో రాజకీయ శిక్షణ తరగతులు జరిగాయి.

- దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డికి రామచంద్రారెడ్డి వరుసకు సోదరుడు అవుతాడు. రామలింగారెడ్డి, రామచంద్రారెడ్డిల తాతలు అన్నదమ్ముళ్లు. రామలింగారెడ్డి మృతి చెందినప్పుడు చిట్టాపూర్‌కు వచ్చి రామచంద్రారెడ్డి కంటతడి పెట్టారు.

- 1964 నుంచి దుబ్బాక సమితి ప్రెసిడెంట్‌గా, 1970–72 వరకు సిద్దిపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు.
- 1972లో దొమ్మాట అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- 1978 నుంచి మెదక్ జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్‌గా పనిచేశారు.
- 1988 –89లో ఎన్‌టీఆర్ ప్రభుత్వంలో ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు.
- 1996 నుంచి 2002 వరకు రాజ్యసభ సభ్యుడిగా, రాజ్యసభలో టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా, రాజ్యసభ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు.
- ఉమ్మడి మెదక్‌కు కాంగ్రెస్, టీడీపీల తరఫున పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు.
- ఇండియా –చైనా మిత్రమండలి అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు.
- సీఆర్ ఫౌండేషన్ తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టుతో ఇతర సంస్థలకు సభ్యుడిగా సేవలు అందించారు.
- లోక్‌సత్తాలో సైతం పనిచేసి అనేక ఉద్యమాలకు నేతృత్వం వహించారు.
- గత కొన్నేళ్లుగా ఆయన రాజకీయాలకు దూరంగా ఉన్నారు.
- మాజీ ప్రధాని ఇందిరాగాంధీతో మొదలుకొని, మాజీ సీఎంలు చెన్నారెడ్డి, ఎన్‌టీఆర్, చంద్రబాబుతో సన్నిహిత సంబంధాలు నెరిపారు.

నక్సల్స్ ఇంటిని పేల్చడంతో కలత

ప్రగతిశీల వామపక్ష భావాలతో ఉండే రామచంద్రారెడ్డి గ్రామంలోని దళితులు, వెనుకబడిన కులాల వారిని ఎంతగానో ప్రోత్సహించారు. గ్రామంలో సమానత్వం తీసుకొచ్చే సమయంలోనే నక్సలైట్ ఉద్యమం మొదలైంది. అప్పటికే జిల్లాలో చాలా నక్సలైట్ గ్రూపులు ఉండేవి. భూస్వాములు, రాజకీయ నేతలను టార్గెట్ చేసి వారి ఇళ్లు పేల్చేవారు. 1997లో రామచంద్రారెడ్డి పుట్టిపెరిగిన ఇంటిని నక్సలైట్లు పేల్చివేయడంతో తీవ్రంగా కలత చెందాడు. దీంతో కొంతకాలం ఆయన స్వగ్రామానికి వెళ్లేందుకు కూడా ఇష్టపడలేదు. నక్సలైట్ల దాడిలో ఇంట్లోని విలువైన ఫొటోలు, పుస్తకాలు, చిన్నతనంలోని జ్ఞాపకాలు కాలి బూడిద అయ్యాయని చాలా బాధపడ్డారు. పేదలు, ఎస్సీలు కోసం తనకున్న 20 ఎకరాలకు పైగా భూమి ఇస్తే.. నక్సల్స్ ఇలా చేస్తారా అని ప్రశ్నించారు. దీనికి అప్పుడు నక్సల్ వివరణ ఇస్తూ రామచంద్రారెడ్డి టీడీపీలో ఉన్నందునే ఇంటిని పేల్చామన్నారు.



కూడవెల్లి వాగుపై చెక్‌డ్యాం

సినారెతో బంధుత్వం

ప్రముఖకవి, రచయిత డాక్టర్ సి.నారాయణరెడ్డితో రామచంద్రారెడ్డికి దగ్గరి బంధుత్వం ఉంది. రామచంద్రారెడ్డి అమ్మమ్మ ఊరు మరిగడ్డ, సినారే స్వగ్రామం హన్మాజీపేట పక్క పక్క గ్రామాలే. ఇస్కస్ తదితర అభ్యుదయ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా వీరిద్దరికి మంచి పరిచయం ఉంది. ఈ క్రమంలోనే 1986లో సినారే నాలుగో కుమార్తె కృష్ణవేణిని రామచంద్రారెడ్డి పెద్ద కుమారుడు (రాష్ట్ర గ్రామీణ బ్యాంకుల అసోషియేషన్ అధ్యక్షుడు) వెంకటేశ్వర్‌రెడ్డికి ఇచ్చి వివాహం చేయడంతో ఇద్దరు వియ్యం అందుకున్నారు.1996 నుంచి 2002 వరకు రామచంద్రారెడ్డి, సినారె ఒకే సమయంలో రాజ్యసభ సభ్యులుగా కొనసాగడం మరో విశేషం.



సినారెతో రామచంద్రారెడ్డి (ఫైల్)

పార్సిల్ డెలివరీ పేరిట సైబర్ మోసం

సిద్దిపేటకమాన్: డ్రెస్ మెటిరీయల్ పార్సిల్ డెలివరీకి సంబంధించి ఫోన్‌కాల్‌కు స్పందించి గుర్తు తెలియని వ్యక్తికి డబ్బులు పంపించి ఒకరు మోసపోయారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత తెలిపిన వివరాల ప్రకారం..దుబ్బాక పీఎస్ పరిధిలో ఓ మహిళ ఇన్‌స్టాగాంలో డ్రెస్‌కు సంబంధించిన ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసింది. అనంతరం ఆమె వాట్సాప్ నంబరుకు గుర్తు తెలియని వ్యక్తి మెసేజ్ చేశాడు. ఆ ఆర్డర్‌కు సంబంధించిన డబ్బు చెల్లించాలని లేదంటే డ్రెస్ పార్శిల్ డెలివరీ చేయలేమని నమ్మబలికాడు. అది నమ్మిన బాధితురాలు గుర్తు తెలియని వ్యక్తి పంపిన నంబరుకు ఫోన్ పే, గూగుల్‌పే ద్వారా పలు దఫాలుగా రూ.80,893 పంపించింది. అనుమానంతో ఆ నంబరుకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. ఇక చేసేదేమి లేక తను మోసపోయినట్టుగా గుర్తించింది. వెంటనే బాధితురాలు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేసింది.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

పెద్దశంకరంపేట(మెదక్): రెండు డీసీఎంలలో అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే... జాతీయ రహదారిపై కోళాపల్లి టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సోమవారం రాత్రి పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో నాందేడ్ నుంచి డీసీఎంలో 47 దూడలు, సిర్గాపూర్ నుంచి డీసీఎంలో 26 లేగదూడలను ఎలాంటి అనుమతులు లేకుండా హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో వాహనాలతో పాటు పశువులను స్వాధీనం చేసుకొని డ్రైవర్లు ఇర్ఫాన్‌ఖాన్, మహ్మద్‌లను అరెస్ట్ చేశారు. అనంతరం పశువులను టేక్మాల్ మండలం వెల్పుగొండలోని గోశాలకు తరలించారు. కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నట్టు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.



పెద్దశంకరంపేటలో పోలీసులు స్వాధీనం చేసుకున్న పశువులు

మద్యం సేవించడానికి వచ్చి..

పటాన్‌చెరు టౌన్: మద్యం సేవించడానికి వచ్చి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ పాషా కథనం ప్రకారం...మధ్యప్రదేశ్‌కు చెందిన రిషి వీకే(40) ఆరునెలల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు మండలం పాటీ గ్రామ సమీపంలోని ఓ నిర్మాణ రంగ సంస్థ వద్ద కూలీ పని చేస్తున్నాడు ఈ క్రమంలోనే మద్యానికి బానిస అయిన రిషి వచ్చిన కూలి డబ్బులు తాగేందుకు ఖర్చు చేసేవాడు. సోమవారం మద్యం సేవించడానికి వెళ్లి, రామచంద్రాపురం పరిధిలోని వెలమెల చౌరస్తాలో ఓ షాపు ముందు గాయాలతో పడి ఉండడాన్ని మంగళవారం ఉదయం స్థానికులు, షాపు నిర్వాహకులు గుర్తించారు. వివరాలు అడగగా, చెప్పి మంచినీరు అడిగాడు. తాగిని కొద్దిసేపటికే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డీసీఎం బోల్తా

తూప్రాన్: విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఓ డీసీఎం బోల్తా పడింది. వివరాల్లోకి వెళితే...శివ్వంపేట మండలం శభాష్‌పల్లిలోని సుగుణ పరిశ్రమ నుంచి దాణా లోడుతో ఓ డీసీఎం కరీంనగర్‌కు బయలు దేరింది. తూప్రాన్‌లోని పోతరాజుపల్లి కమాన్ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించపోయి డీసీఎం రహదారి కిందకు దూసుకెళ్లింది. ఈ క్రమంలోనే విద్యుత్ స్తంభాన్ని అతివేగంగా ఢీకొని బోల్తా పడింది. విద్యుత్ స్తంభం విరిగి తీగలు భూమిపై తెగి పడ్డాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ కృష్ణకు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



రెండు బైక్‌లు ఢీ: ఒకరి మృతి

పాపన్నపేట(మెదక్): రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఎస్‌ఐ విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..తమ్మాయపల్లి గ్రామానికి చెందిన రైతు అంతటి దుర్గయ్య (50) ఆస్పత్రిలో ఉన్న తన బంధువులను పరామర్శించడానికి మెదక్ ఏరియా ఆస్పత్రికి సోమవారం వెళ్లాడు. అదే రోజు రాత్రి తిరిగి వస్తుండగా, యూసూఫ్‌పేట శివారులో ఎదురుగా వస్తున్న బైక్ దుర్గయ్య బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడిన దుర్గయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్యామ్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



దుర్గయ్య (ఫైల్)

దొంగతనం కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష

కమ్మర్‌పల్లి/ఖలీల్‌వాడి: పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనానికి పాల్పడిన ఇద్దరికి ఏడాది జైలు శిక్ష పడింది. ఈ కేసుకు సంబంధించి కమ్మర్‌పల్లి ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపిన ప్రకారం.. 2022 సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నెలల్లో కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల్లో నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దొంగతనానికి గురయ్యాయి. పోలీసులు విచారణ చేపట్టి కేసులో ఏపీలోని సింగరాయకొండకు చెందిన పల్లిపాటి ఏసుదాసు, మెదక్ జిల్లా చిన్న శంకరంపేట శాలిపేట గ్రామానికి చెందిన నర్రా శ్రీధర్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి 280 కిలోల కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేశారు. అనంతరం ఆధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన ఆర్మూర్ ఏజేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ వేముల దీప్తి మంగళవారం నిందితులిద్దరికి ఒక సంవత్సరం పాటు సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.

గొంతుకోసిన ఘటనలో ఒకరి అరెస్ట్

అక్కన్నపేట(హుస్నాబాద్): మత్తులో స్నేహితుడి గొంతు కోసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ తాండ్ర వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. సంఘ విక్రమ్, నరసింహలిద్దరూ స్నేహితులుకాగా, జనగామ శివారులో తాగిన మత్తులో గొడవ పడడం విక్రమ్ గొంతు నరసింహా కోసిన విషయం తెలిసిందే. మంగళవారం మండలంలోని బొడిగేపల్లి స్టేజ్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా బైక్‌పై వెళుతుండగా, నరసింహను అదుపులోకి తీసుకున్నారు. అమ్మాయిల విషయంతో గొడవ జరిగి గొంతు కోశానని నిందితుడు ఒప్పుకోవడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి బైక్‌ను సీజ్ చేశారు.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురి అదృశ్యం

పెద్దశంకరంపేటలో వేర్వేరుచోట్ల ఇద్దరు, న్యాల్‌కల్‌లో ఇద్దరు, నారాయణఖేడ్‌లో మరొకరు అదృశ్యమయ్యారు.

టీవీ రీచార్జ్ కోసం వెళ్లి..



సాయబుగారి విఠల్ (ఫైల్)

పెద్దశంకరంపేట(మెదక్): ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మల్కాపూర్‌కు చెందిన సాయబుగారి విఠల్ ఈ నెల 23వ తేదీన టీవీ రీచార్జ్ కోసం బైక్‌పై పెద్దశంకరంపేటకు వచ్చాడు. అప్పటి నుంచి ఇంటికి రాలేదు. ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో విఠల్ తండ్రి లక్ష్మయ్య మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పందులు పట్టడానికి వెళ్లి...



దేరంగుల కృష్ణ (ఫైల్)

పెద్దశంకరంపేట(మెదక్): ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం..పెద్దశంకరంపేటలోని వడ్డెరవాడకు చెందిన దేరంగుల కృష్ణ ఈ నెల 16వ తేదీన పందులు పట్టడానికి ఎరుకల రామయ్యతో కలిసి వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. ఈ విషయమై రామయ్యను ఆరా తీయగా, పందులు పట్టడానికి బెంగుళూరు వెళ్లామని, 18వ తేదీన ట్రైన్‌లో కృష్ణ హైదరాబాద్‌కు వెళ్లాడని చెప్పాడు. బంధువుల వద్ద ఆరా తీసినా ఏ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కృష్ణ భార్య స్వరూప మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

హాస్టల్లో ఉండి చదవడం ఇష్టం లేక...



ఓంకార్

నారాయణఖేడ్: ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం.. కంగ్టి మండలంలోని చుక్కల్‌తీర్థ్ గ్రామానికి చెందిన కోలాబాస్ ఓంకార్(13) కోహీర్ మండల పరిధిలోని దిగ్వాల్ బీసీ హాస్టల్‌లో పదోతరగతి, జూకల్ శివారులోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో అతడి సోదరి డిగ్రీ చదువుతోంది. సోమవారం ఓంకార్‌ను తండ్రి సాయిగొండ హాస్టల్‌కు పంపించేందుకు ఖేడ్‌కు తీసుకొచ్చాడు. ముందుగా సోదరిని చూడటానికి తండ్రీకొడుకు కలిసి వెళ్లారు. ఈ క్రమంలోనే ఓంకార్ తండ్రి కళ్లుగప్పి కనిపించకుండా పోయాడు. హాస్టల్‌లో ఉంటూ చదడం ఇష్టం లేదని చెబుతుండేవాడని, అందువల్లే పారిపోయి ఉంటాడని సాయిగొండ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పనిపై బయటకు వెళ్లి...



నసీర్(ఫైల్)

న్యాల్‌కల్(జహీరాబాద్): హద్నూర్ ఎస్‌ఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం... మామిడ్గికి చెందిన నసీర్ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఈనెల 24న మధ్యాహ్నం ఇంటి నుంచి పని చేసేందుకు వెళ్లాడు. ఎంతకూ తిరిగి రాలేదు. చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా నసీర్ ఆచూకీ లభించలేదు. భార్య నజీం బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అమీన్‌పూర్‌కు వెళుతున్నానని చెప్పి..



సునీత(ఫైల్)

న్యాల్‌కల్‌కు చెందిన సునీతకు హుస్సేన్‌నగర్ గ్రామానికి చెందిన నర్సింహులుకు ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. దంపతులు అమీన్‌పూర్‌లో ఉంటున్నారు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. దంపతుల మధ్య డబ్బుల విషయంలో గొడవ జరిగింది. దీంతో సునీత ఇటీవల పిల్లలతో స్వగ్రామానికి వచ్చింది. సోమవారం ఉదయం దంపతులు చాల్కి చౌరస్తా వద్ద కలిశారు. పిల్లలను తీసుకొస్తానని నర్సింహులు న్యాల్‌కల్‌కు రాగా, సునీత అమీన్‌పూర్‌కు ఆటోలో బయలుదేరింది. అయితే సునీత ఇంటికి చేరలేదు. దీంతో ఆమె కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వినయ్‌కుమార్ తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి



కండువా కప్పుతున్న డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: తమపై నమ్మకంతో కాంగ్రెస్‌లో చేరిన ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని, ఏ కష్టం వచ్చినా 24 గంటలూ తన ఇంటి తలుపులు తెరచే ఉంటాయని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి భరోసానిచ్చారు. కంగ్టి మండలం నాగూర్ (బీ) గ్రామానికి చెందిన సుమారు 50 మంది బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం మాజీ ఎంపీటీసీ కాశీనాథ్ పటేల్, నాయకుడు పండరీ ఆధ్వర్యంలో డాక్టర్ సంజీవరెడ్డి సమక్షంలో ఖేడ్‌లోని నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ సంజీవరెడ్డి మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ నాయకుల అవినీతి, అక్రమాలను ఎండగడుతూ ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.

గీతంలో నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు ప్రారంభం

పటాన్‌చెరు: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరం నుంచి (జాతీ య విద్యావిధానం–2020లోభాగంగా) నాలుగేళ్ల డిగ్రీ (హానర్స్) కోర్సులను ప్రారంభి స్తోందని అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ సి.ఉదయ కుమార్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ నాలుగేళ్ల కోర్సుల్లో విద్యార్థులకు క్లిష్టమైన సమస్య–పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచన, భావప్రకటనా (కమ్యూనికేషన్) నైపుణ్యాలతోపాటుగా కళలు (ఆర్ట్స్), మానవీయ శాస్త్రాలు (హ్యుమానిటీస్), మేనేజ్‌మెంట్, సైన్స్‌లోని అంతర్ విభాగ పాఠ్యాంశాలను మేజర్, మైనర్లగా అభ్యసించవచ్చని తెలిపారు. మనదేశంలోని 19 కేంద్రీయ విశ్వ విద్యాలయాలతో సహా 105 వర్సిటీలు ఈ నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ కోర్సును 2023–24 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నాయని, అందులో గీతమ్ కూడా ఒకటని పేర్కొన్నారు. గీతం విశాఖ, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాల్లో ఇంజినీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, బీ–ఆప్టోమెట్రీ, పబ్లిక్ పాలసీ, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, లా, మెడికల్, నర్సింగ్, ఫిజియోథెరపీ, పారామెడికల్ వంటి వృత్తివిద్యా కోర్సులనూ నిర్వహిస్తోందని వివరించారు. గీతం ప్రవేశ పరీక్ష (గాట్–2023) ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్న ట్టు అడ్మిషన్స్ డైరెక్టర్ తెలిపారు. వివరాల కోసం ప్రవేశాల విభాగాధిపతి డాక్టర్ కె.శివకుమార్ 9542424256/59 నంబర్లలో సంప్రదించాలని లేదా www.gitam.eduను సందర్శించాలని విజ్ఞప్తి చేశారు.